చొప్పదండి కారుకు బ్రేకులు!

- బీఆర్ఎస్‌కు రాంరాం చెబుతున్న ముఖ్య నాయకులు
- కాంగ్రెస్‌కు క్యూ కడుతున్న ప్రజాప్రతినిధులు
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్‌లో వింత పరిస్థితి
- కలిసి రాని అసంతృప్త నాయకులు
- ఒకరికి ఒకేసారి పదవి సెంటిమెంట్ పునరావృతం కానుందా..?


ఇటీవల బోయిన్‌పల్లి మండల ప్రచారంలో నిరసన సెగ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: గత రెండు పర్యాయాల నుంచి కొనసాగుతున్న చొప్పదండి నియోజకవర్గ కారు స్పీడుకు ఎన్నికల ముందు అకస్మాత్తుగా బ్రేకులు పడుతుండటం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. పక్షం రోజులుగా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పార్టీని వీడుతూ కాంగ్రెస్ బాట పడుతుండటంతో పార్టీ క్యాడర్‌లో నిస్తేజాన్ని నింపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అలవోకగా గెలుస్తామనే అతి ఆత్మవిశ్వాసం కూడా నష్టం చేకూర్చుతోందని పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు. రెండు పర్యాయాలు బీఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో గెలవగా.. ప్రస్తుతం గడ్డు పరిస్థితులు రావడానికి, రివర్స్ గేరులో కారు నడవడానికి కారణం ఎవరని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నాయకుల అసంతృప్తి

ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకులు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వ్యవహార శైలిపై అసంతృప్తిని బాహాటంగా వెళ్లగక్కారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన పార్టీ నాయకుల బర్త్‌డే వేడుకలకు హాజరైన మంత్రి, మాజీ ఎంపీల ముందు రవిశంకర్‌కు టికెటిస్తే గెలపించే ప్రసక్తే లేదని తమ అసంతృప్తిని అప్పట్లోనే బయటపెట్టడం సంచలనం సృష్టించింది. సంక్షేమ పథకాల అమలులో, లబ్ధిదారుల ఎంపికలో ఒంటెత్తు పోకడ, చేతివాటం లేకుండా పథకాల మంజూరు కావడం లేదని విమర్శలు కూడా వచ్చాయి. ఇప్పటికి ప్రధాన నాయకులు అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తుండటం, గ్రామాలు, పట్టణాల్లో బలమైన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతుండటం క్యాడర్‌ను డీలాకు గురి చేస్తోంది.

నిరసనల సెగ

నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు నిరసనల సెగ తలనొప్పిగా మారింది. మల్యాల, కొడిమ్యాల, బోయిన్‌పల్లి, రామడుగు మండలాల్లో నిర్వహించిన పార్టీ ప్రచారంలో పలుచోట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి ఏపాటి మద్దతు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. రవిశంకర్‌తో విభేదాల మూలంగా కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి ఆయన క్యాడర్‌తో కలిసి కాంగ్రెస్ గూటికి చేరడం బీఆర్ఎస్‌కు భారీ షాక్‌నిచ్చింది. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో తమకు ప్రాధాన్యమివ్వలేదని, ఇప్పటికే కీలక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అసంతృప్తి నాయకుల బుజ్జగింపు చర్యలు లేకపోవడం, గ్రామాలు, పట్టణాల్లో బలమైన నాయకులు పార్టీకి దూరం కావడం, ప్రభుత్వ ప్రతికూలత అంశంతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్‌లో నెలకొన్న పరిస్థితిపై పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే గారు.. మా గ్రామానికి రావద్దు


కోరెం-అనంతపల్లి దారిలో ఫ్లెక్సీలు

బోయినపల్లి(చొప్పదండి): గౌరవనీయులు చొప్పదండి శాసనసభ్యులు గారు మీరు మా గ్రామానికి రావద్దని రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం-అనంతపల్లి మార్గంలో శుక్రవారం ఫ్లెక్సీలు వెలిశాయి. స్థానికంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పర్యటన ఉన్న నేపథ్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చకు దారితీశాయి. దళితబంధు అమలుపరచాకే రండి.. మీకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతాం.. కోరెం-గుండన్నపల్లి బీటీ రోడ్డు, కల్వర్టు పనులు చేశాకే రండి.. మీరు మా ఊరికి ఏకగ్రీవ హామీ రూ.25లక్షలు ఇచ్చాకే రండి అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సంచలనం రేపింది. మూడు హామీలపై మూడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా

- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ


మాట్లాడుతున్న కవ్వంపల్లి

శంకరపట్నం: డాక్టర్ వృత్తిలో కొనసాగుతూ కూడా ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చింగుట్ట, అంబాల్‌పూర్, మొలంగూర్ గ్రామాల్లో పర్యటించారు. గోసిగొంగడితో వచ్చి రసమయి బాలకిషన్ వందల కోట్లు సంపాదించాడని విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టివ్వకుండా మభ్యపెడుతూ మోసం చేశారని ఆరోపించారు. ఊరి, ఇంటి పేరు తెలియకుండానే రెండుసార్లు గెలిపిస్తే కోట్లు సంపాదించి ఫాంహౌజ్ కట్టుకున్నాడన్నారు. చింతలపల్లి మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరగా.. కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని పలువురు వైద్యులు మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు బసవయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రహీం, రాజిరెడ్డి, తిరుపతి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలను విస్మరించిన బీఆర్ఎస్

మానకొండూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలను పట్టించుకోలేదని, ముస్లింలను విస్మరించిందని ఉమ్మడి రాష్ట్ర మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖుస్రోపాషా అన్నారు. మండల కేంద్రంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ముస్లిం మేనిఫెస్టో ఉపయోగకరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో మండలంలో నిర్మించిన షాదీఖానా నిర్మాణం మధ్యలోనే నిల్చిపోయిందన్నారు. కవ్వంపల్లి మాట్లాడుతూ.. మేనిఫెస్టోకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. మద్దతు తెలిపిన ముస్లింలకు కృతజ్ఞతలు తెలిపారు. రంగపేటకు చెందిన రెడ్డి సంఘం నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రవీంద్రచారి, మల్లారెడ్డి, నాగిరెడ్డి, బక్కారెడ్డి, సంపత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఖుస్రోపాషా

ఒక్కసారి అవకాశమివ్వండి

కాంగ్రెస్ చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం


ప్రచారం చేస్తున్న మేడిపల్లి సత్యం


రాజుకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మేడిపల్లి సత్యం

మల్యాల: చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూ పదేళ్లుగా ప్రజల మధ్యే ఉంటున్నానని, ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశమివ్వాలని కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం కోరారు. నూకపల్లి, రామన్నపేట, బల్వంతాపూర్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇంటింటా అమలు చేస్తామని, తెలంగాణ ఉద్యమకారుడిగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి అయిన తనకు అవకాశమివ్వాలన్నారు. ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, శోభారాణి, ఆదిరెడ్డి, మారంపల్లి లక్ష్మణ్, బత్తిని శ్రీనివాస్, జలం, నర్సింహారెడ్డి, మిల్క్ శ్రీను, నేరెళ్ల సతీశ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్‌విండో వైస్ చైర్మన్

రామడుగు: కొక్కెరకుంట సింగిల్‌విండో వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు సుద్దగోని రాజు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సత్యం కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ వైస్ చైర్మన్ శంకరయ్య, డైరెక్టర్లు రాజు, లక్ష్మీ, మల్లయ్య, నారాయణ, మల్లేశం, రాజు, నాగేంద్ర, మధుసూదన్ పార్టీలో చేరారు. నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికే..

ఇల్లందకుంట: ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపి శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం సిరిసేడు గ్రామంలో పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జమ్మికుంట, పట్టణ, రూరల్ సీఐలు బర్పటి రమేశ్, కిషోర్, ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

వీణవంక: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చల్లూర్, వీణవంక గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఐ ఆసిఫ్, పోలీసులు పాల్గొన్నారు.

ఓటింగ్ పరిశీలన

మానకొండూర్‌రూరల్: ముంజంపల్లిలో ఓటర్ల ఇంటి వద్ద నిర్వహిస్తున్న ఓటింగ్‌ను శుక్రవారం జనరల్ ఆర్‌వో ఐఏఎస్ రవికుమార్ పరిశీలించారు. వృద్ధులు, వికలాంగులు పోలింగ్ బూత్‌కు వెళ్లకుండా ఓటేసే సదుపాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుస్తున్న కేసీఆర్

- ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి


మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి


ప్రచారం చేస్తున్న కౌశిక్‌రెడ్డి తమ్ముడు ప్రణీత్‌రెడ్డి

కమలాపూర్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు అండగా నిలుస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. గడిచిన 60 ఏళ్లలో దివ్యాంగులను ఏ రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం దివ్యాంగుల కోసం ఆలోచించి గొప్ప నిర్ణయం తీసుకొని రూ.4వేల పింఛన్ అందిస్తున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. మోటార్లకు మీటర్లు పెట్టాలంటున్న బీజేపీ కావాలో.. మూడు గంటల కరెంట్ చాలంటున్న కాంగ్రెస్ కావాలో ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ కొత్త మేనిఫెస్టోలో దివ్యాంగుల పింఛన్‌ను రూ.5వేలకు పెంచుతున్నట్లు ప్రకటించిందని అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్, కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, హుజూరాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, దివ్యాంగులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి తమ్ముడి ప్రచారం

జమ్మికుంట: బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం తమ్ముడు పాడి ప్రణీత్‌రెడ్డి దంపతులు పట్టణంలోని 30 వార్డు కౌన్సిలర్ మద్ది లావణ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు సమ్మెట సదానందం, పోడేటి రామస్వామి, అర్బన్ పార్టీ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేరిక..

పట్టణంలోని 14వ వార్డుకు చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకృష్ణ, అరెల్లి సంధ్య సమక్షంలో 20 మంది బీజేపీ మహిళలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్, యూత్ నాయకులు గుల్లి ప్రతాప్, అశోక్, లింగంపల్లి సరోజన, గంజి సంధ్య, వనమాల, లక్ష్మి, లావణ్య, శారద, సరోజన, స్వరూప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి ఓటేయాలని కోరుతూ శుక్రవారం నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణిసురేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ జయసుధవాసుదేవరెడ్డి, గ్రామ అధ్యక్షుడు సదానందం, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్, సింగిల్‌విండో ఉపాధ్యక్షులు రజిత పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి..

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్


ప్రజలకు అభివాదం చేస్తున్న సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని.. ప్రజలు మరోసారి ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని తంగళ్లపల్లి, కూరెళ్ల, ధర్మసాగర్‌పల్లి, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. పదేళ్ల క్రితం రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ పథకాలు లేవని, కేసీఆర్ సీఎం అయిన తర్వాతే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రూ. 400కే సిలిండర్ ఇస్తామని.. ఆసరా, రైతుబంధును పెంచుతామని హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలోని అన్ని అంశాలు అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తి, వైస్ చైర్మన్ తడకల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాము నాగేశ్వరి శ్రీకాంత్, గాజుల రమేష్, తోట భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సతీశ్‌కుమార్ వెంటే గౌడ సంఘం


మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

చిగురుమామిడి: హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన గౌడ కులస్తులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని గౌడ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. పొన్నం గౌడ్ కుల సంఘ పరిరక్షణ కోసం ఏనాడు మాట్లాడలేదన్నారు. సతీశ్‌కుమార్ పది సంవత్సరాల కాలంలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణాల కోసం వేలాది రూపాయలు ఖర్చుచేశాడన్నారు. సమావేశంలో చిగురుమామిడి మండల పరిషత్ అధ్యక్షురాలు కొత్త వినీత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, భీమదేవరపల్లి జెడ్పీటీసీ, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

మీ కష్టసుఖాల్లో తోడుంటా

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రణవ్


హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ప్రణవ్

హుజూరాబాద్: మీ కష్టసుఖాల్లో తోడుగా ఉంటా.. ఓటేసి గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి, కొత్తపల్లి, ఇందిరానగర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుష్పలత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గూడూరు స్వామిరెడ్డి, శ్రీను, రాజేందప్రసాద్, బాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్ సమక్షంలో వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అనూష సతీష్‌గౌడ్, ఎంపీటీసీ రాధారపు రామచంద్రం ఆ పార్టీలో చేరారు. మాజీ ఎంపీపీ బొబ్బిలి మల్లమ్మ, మాజీ సర్పంచ్ మేక వీరయ్య, హుజూరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు చందమల్ల బాబు, దుబాసి బాబు, టేకుల శ్రావణ్, వైఎస్సార్‌టీపీ నాయకుడు చందమల్ల నరేష్ పార్టీలో చేరగా.. వారికి పార్టీ కుండవా కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లోకి ఈటల ప్రధాన అనుచరుడు

సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్ సమక్షంలో ఈటల ప్రధాన అనుచరుడు బీఆర్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కుండవా కప్పి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం తనవంతు బాధ్యతగా తప్పక కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ప్రభాకర్

కమలాపూర్: గుండేడుకు చెందిన కుమ్మరి సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీఆర్ఎస్ నాయకుడు నాంపల్లి ప్రభాకర్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ అభ్యర్థి వొడితల ప్రణవ్ కండువా కప్పి ఆహ్వానించారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు


ప్లాంట్ ప్రారంభిస్తున్న దాతలు

తిమ్మాపూర్: ఎల్ఎండీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత విద్య అభ్యసించి జర్మనీలో ఉద్యోగం చేస్తున్న స్థానిక మహాత్మానగర్‌కు చెందిన విజయ-వెంకటపతి పటేల్ కుమారుడు వంశీకష్ణ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయించారు. రూ.40 వేలతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం రాజభాను చంద్రప్రకాశ్ తెలిపారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించిన వంశీకష్ణ-నిధి దంపతులను ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు సత్కరించారు.

మొగిలిపాలెం జేఎల్ఎంకు గాయాలు

తిమ్మాపూర్: మొగిలిపాలెం జేఎల్ఎం సతీష్‌కు ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి గాయాలపాలయ్యాడు. లైన్‌మెన్ రాజేందర్ ఆదేశాల మేరకు జేఎల్ఎం సతీష్ విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా.. రాంగ్ ఎల్సీ ఉండడంతో మరమ్మతులు చేస్తున్న సతీష్ చేతిలో గడ్డపార ఉండడంతో ప్రమాదవశాత్తు 11 కేవీ తీగలకు తగిలి విద్యుత్ సరఫరా జరిగి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఒక్కసారిగా ఏం జరిగిందో తెలియక సతీష్ కుప్పకూలిపోయాడు. లైన్మెన్ ట్రాన్స్‌ఫార్మర్ నిలిపివేశారో లేదో చెక్ చేసుకోకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, రాంగ్ ఎల్సీ కారణంగానే ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపించారు. ఈ విషయమై నుస్తులాపూర్ ఏఈ అరవింద్‌రెడ్డిని వివరణ కోరగా.. చిన్నపాటి గాయాలయ్యాయని అన్నారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేదని వివరించారు. దీనిపై విచారణ చేస్తామని తెలిపారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా లింగారెడ్డి

చిగురుమామిడి: చిగురుమామిడి పీఆర్‌టీయూ మండల శాఖ(ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) అధ్యక్షుడిగా ఇనుకొండ లింగారెడ్డి(కాశవాడ ఉల్లంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దుబ్బాక బాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికున్నట్లు చెప్పారు. ఇదివరకు ఉన్న దొమ్మాట కృష్ణారెడ్డి పీజీ హెచ్ఎంగా పదోన్నతిపై వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీ ఏర్పడిందన్నారు. మండల శాఖ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి అధ్యక్షుడిగా లింగారెడ్డిని ఎన్నికున్నామన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.జైపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మానకొండూర్‌రూరల్: వెల్ది గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఆర్‌బీఎస్‌కే టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీనిత, హెచ్ఎం శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభాకర్ దశదినకర్మకు రూ.55వేల విరాళాలు


హాజరైన గ్రామస్తులు

చిగురుమామిడి: ఇందుర్తి గ్రామంలో మేడిశెట్టి ప్రభాకర్ దశదినకర్మకు వాట్సాప్ మిత్రులు, బీఆర్ఎస్ హుస్నాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆర్థిక సాయమందించారు. పది రోజుల క్రితం ప్రభాకర్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామస్తులు దహన సంస్కారాలు నిర్వహించారు. దశదినకర్మ నిర్వహణకు గ్రామ ఒకటో వార్డు సభ్యుడు విష్ణమాచారి వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. గ్రామస్తులు, దాతలు, తోటి మిత్రులు కలిసి రూ.50వేలు పోగు చేశారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ రూ.5వేలందించారు. మొత్తం రూ.55వేలతో ఘనంగా ప్రభాకర్ పేరున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభాకర్‌కు పెళ్లి కాలేదు, తల్లిదండ్రులు కొన్ని సంవత్సరాల క్రితమే అనారోగ్యంతో మృతిచెందారు. గ్రామ సర్పంచ్ అందె స్వరూప, ఎంపీటీసీ అందె స్వప్న, ఉప సర్పంచ్ తోట సతీష్, వార్డు సభ్యులు డాక్టర్ శ్రీను, ఎస్.సిరాజ్, జర్నలిస్టు రఘునాథరెడ్డి, ఆయా పార్టీల నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.